క్లుప్తంగా

ప్రభుత్వ స్కూల్‌లో నల్లా ట్యాప్‌ల అపహరణ



చెన్నారావుపేట : మండలంలోని కోనాపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన నల్లా ట్యాప్‌లు అపహరణకు గురైన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. హెచ్‌ఎం రవీందర్ కథనం ప్రకారం .. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలకు నిధులు విడుదల చేయడంతో నల్లా టాపులు ఏర్పాటు చేశామన్నారు. నల్లా ట్యాపులను అపహరించడం దారుణమని ఆయన అన్నారు. పాఠశాలల్లో ఎవరు, ఎలాంటి చోరీకి పాల్పడినా పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఎస్‌ఎంసీ చైర్మన్ ఎర్ర మమత రాజు అన్నారు. జీపీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆమె తెలిపారు. నిందితులకు గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

బస్టాండ్‌లో ఇష్టారాజ్యంగా పార్కింగ్



రాయపర్తి (వర్ధన్నపేట) : పట్టణంలోని బస్టాండ్ ప్రాంగణంలో కొందరు ద్విచక్ర వాహనదారులు ఇష్టారీతిన పార్కింగ్ చేస్తున్నారు. ప్రయాణికులు కూర్చునేలా ఏర్పాటు చేసిన చోటే మంగళవారం ఒకరు ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి గంటల కొద్దీ ఎటో వెళ్లిపోవడం వివాదాస్పదంగా మారింది. ఈ విషయమై బస్టాండ్ నిర్వహణాధికారి అసహనం వ్యక్తం చేశారు. ప్రతీరోజు బస్టాండ్ ఆవరణలో పలువురు ద్విచక్ర వాహనాలు పార్క్ చేసి ఆర్టీసీ బస్సుల్లో, ఇతర వాహనాల్లో వేరే ప్రాంతాలకు వెళ్లి పనులు చూసుకుని వస్తున్నారని తెలుస్తోంది. ఊళ్లకు వెళ్లే వ్యక్తులు బస్టాండ్ ఆవరణలో కాకుండా బయట అవకాశం ఉన్న చోట వాహనాలు పార్కింగ్ చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

మాజీ ఎంపీపీకి ఆత్మీయ వీడ్కోలు



సంగెం : మండలంలోని కుంటపల్లిలో మాజీ ఎంపీపీ కళావతికి పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో మంగళవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. పౌర సన్మానం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి, తహసీల్దార్ రాజ్‌కుమార్ అతిథిగా హాజరై మాట్లాడారు. ఎంపీపీగా కళావతి ప్రజలకు ఎనలేని సేవలు చేశారని అభినందించారు. ప్రజాప్రతినిధులు ప్రజాసేవలో తరలించాలని ఆకాంక్షించారు. పదవి లేకున్నా ప్రజల్లో ఉంటూ సేవ చేయాలని సూచించారు. నిస్వార్థంగా సేవలు అందిస్తే ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కావటి వెంకటయ్య, ఎలగోయ లింగయ్య, రౌతు నాగయ్య, నాయకులు దూడయ్య, జగన్నాథచారి, మొగిలి, స్వామి, ప్రతాప్, రాజు, రమేశ్, ఆనంద్, నర్సయ్య పంచాయతీ కార్యదర్శి వాజిద్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

చెన్నారావుపేట : ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని కాల్‌నాయక్‌తండాకు చెందిన జరుపుల తారోనీ ఇల్లు కూలిపోగా ఆమెకు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండల నాయకుడు బాదావత్ వీరన్న మంగళవారం రూ.2,500 సాయం అందజేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో గుగులోతు వీరన్న, సత్యం, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

పర్వతగిరి : మండలంలోని గోరుగుట్టతండాకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త భూక్య వీరన్న తండ్రి దర్జ్యా (65) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందగా అతడి మృతదేహానికి ఆ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వాగ్యనాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, సీనియర్ నాయకులు మందడపు భూషయ్య, ఎస్సీ సెల్ మండల నాయకులు చల్ల వెంకన్న, జంగిలి సమ్మన్న, తదితరులు పాల్గొన్నారు.

‘రైతు భరోసా’ విడుదల చేయాలి

చెన్నారావుపేట : వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో అర్హులకు వెంటనే రైతు భరోసా ఇవ్వాలని మండలంలోని అమీనాబాద్ రైతుబంధు గ్రామ కమిటీ కన్వీనర్ అమ్మ రాజేశ్ ప్రభుత్వాన్ని మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు నిధులు విడుదల చేయలేదని ఆందోళన వెలిబుచ్చారు.

ఘనంగా సీత్లా భవాని వేడుకలు

నర్సంపేట రూరల్ : నైవేద్యంతో వెళ్తున్న మహిళలు



పర్వతగిరిలో..



రాయపర్తి : వాంకుడోతుతండాలో..



జిల్లాలోని నర్సంపేట, ఖానాపురం, దుగ్గొండి, పర్వతగిరి, సంగెం, రాయపర్తి, వర్ధన్నపేట, చెన్నారావుపేట, తదితర మండలాల్లోని తండాల్లో లంబాడీలు మంగళవారం సీత్లా భవాని వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి కుటుంబీకులతో కలిసి డప్పు చప్పుళ్ల నడుమ ర్యాలీగా వెళ్లి సీత్లా భవాని మాతకు నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించారు. పలువురు యాటపోతులను, కోళ్లు, గొర్రెలు, మేకలను బలి ఇచ్చారు. అనంతరం గొర్ల దాటుడు కార్యక్రమం నిర్వహించారు.

-సాక్షి నెట్‌వర్క్



రాయపర్తి : భవానీకుంటతండాలో సీత్లాపండగలో పాల్గొన్న తండావాసులు



నర్సంపేట రూరల్: బోజ్యనాయక్‌తండా శివారులో..



ఖానాపురం : నాజీతండాలో..



దుగ్గొండి: రాజ్యతండాలో..



సంగెం : సపావత్‌తండాలో..



చెన్నారావుపేటలో..

భక్తుల కొంగుబంగారం కోటమైసమ్మ

- నేడు బోనాల వేడుక
- బంగారు బోనంతో హాజరు కానున్న మంత్రి సురేఖ



గీసుకొండ: మండలంలోని వరంగల్– నర్సంపేట రహదారి పక్కనే కోటగండి వద్ద కొలువైన కోటమైసమ్మ తల్లికి భక్తులు నీరాజనం పలుకుతున్నారు. నర్సంపేట వెళ్లే దారిలో వరంగల్ నుంచి 8 కి.మీ దూరంలో ఈ ఆలయం ఉంటుంది. కాకతీయ రాజుల కాలంలో నిర్మించిన మట్టి కోటను తొలచి ఎన్నో ఏళ్ల క్రితం రహదారిని ఏర్పాటు చేసిన సమయంలో ఇక్కడ కోటమైసమ్మ వెలసిందని చెబుతారు. 2009లో మంత్రి కొండా సురేఖ దంపతులు సొంత ఖర్చులో నూతన ఆలయాన్ని నిర్మించి, అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి వేద పండితులతో ప్రాణప్రతిష్ఠ చేయించారు. నాటి నుంచి.. దసరా, సంక్రాంతి, ఉగాది, జనవరి ఫస్ట్, శివరాత్రి సందర్భంగా భక్తులు అధికంగా తరలివస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ, గుల్బర్గా నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి వస్తుంటారు. ఇక్కడ నూతన వాహనాలకు పూజ చేయిస్తే ఏ ఇబ్బంది ఉండదని భక్తుల విశ్వాసం. ఈ ఆలయం వెనుక భాగంలో ప్రసిద్ధ కొండగిరి సాయినాథ ఆలయం ఉండటంతో ఈ ప్రాంతం ప్రముఖ దైవ కేంద్రంగా మారింది. ఈనేపథ్యంలో నేడు(బుధవారం) అమ్మవారి బోనాల పండుగ సందర్భంగా వంచనగిరి గ్రామస్తులు బోనాలతో తరలిరానున్నారు. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ బంగారు బోనంతో తరలివస్తారని గ్రామస్తులు తెలిపారు.

ఎమ్మెల్యే సహకారంతో సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న హామ్యానాయక్

రాయపర్తి : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కిష్టాపురం గ్రామాన్ని మంగళవారం వారు సందర్శించి సమస్యలపై అధ్యయనం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హామ్యానాయక్, రవీందర్‌రెడ్డి మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ తాగునీటి, రోడ్లు, డ్రైనేజీ, ఇతర అనేక సమస్యలున్నాయని చెప్పారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి నిత్యం ప్రజలకు, పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజిరెడ్డి, రెంటాల గోవర్ధన్‌రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చిర్ర మల్లయ్య, నాయకులు చిన్నపాక ఎల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఉల్లెంగుల నర్సయ్య, సుదర్శన్‌రెడ్డి, చెడుపాక వెంకట్, చెడుపాక రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ మల్లం నవీన్‌కు ఘనసన్మానం



ప్రిన్సిపాల్ నవీన్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

నర్సంపేట : కాకతీయ విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యుడిగా నియమితులైన క్రమంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్‌ను స్టాఫ్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నవీన్ మాట్లాడారు. పాలక మండలి సభ్యుడిగా నియామకమవడంతో తన బాధ్యత మరింతగా పెరిగిందని చెప్పారు. కాకతీయ విశ్వవిద్యాలయ ఉన్నతికి పాటుపడతానని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల సమస్యలను వర్సిటీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా చొరవ తీసుకుంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ ఎ.శ్రీనాథ్, స్టాఫ్ క్లబ్ సెక్రెటరీ, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఐ.శివనాగ శ్రీను, అకడమిక్ కోఆర్డినేటర్ నరేందర్, ఎల్.సత్యనారాయణ, డాక్టర్ బి.విష్ణుకుమార్, ఎం.సమ్మయ్య, డాక్టర్ జి.ప్రసూన, డాక్టర్ లకన్ సింగ్, డాక్టర్ టి.రమేశ్, పి.త్యాగయ్య, డాక్టర్ వి.పూర్ణచందర్, వీరన్న, డాక్టర్ ఆర్.కుమారస్వామి, బి.రమేశ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎస్.స్వరూపరాణి, తదితరులు పాల్గొన్నారు.

అల్పాహార పథకానికి అప్పుల తిప్పలు

- ఆర్నెళ్లుగా బిల్లులు, గౌరవ వేతనం పెండింగ్

నల్లబెల్లి : మండలంలోని సీఎం అల్పాహారం పథకం అమలుకు తిప్పలు తప్పడం లేదు. నిర్వాహకులు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పు చేసి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న దుస్థితి నెలకొంది. ప్రభుత్వం ఆర్నెళ్లుగా బిల్లులు, గౌరవ వేతనం పెండింగ్‌లో పెట్టడంతో నిర్వాహకులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించి హాజరు శాతం పెంచుతామని చెప్పి సీఎం అల్పాహార పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద మండలంలోని 36 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేయగా ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 1386 మంది విద్యార్థులకు అల్పాహారం అందించాలని నిర్ణయించారు. కాగా తొలుత నల్లబెల్లి, రేలకుంట, ముచ్చింపుల, ముచ్చింపుల తండా, నందిగామ ప్రాథమిక పాఠశాలతోపాటు నందిగామ హైస్కూల్లో పథకం అమలు చేపట్టారు. 304 మంది విద్యార్థులకు ఉదయం వేళ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం అల్పాహారం అందిస్తున్నారు.

గౌరవ వేతనం పెండింగ్‌లోనే..

అల్పాహారం అందిస్తున్న కార్మికులకు కేవలం వెయ్యి రూపాయలు చొప్పున గౌరవ వేతనం ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆర్నెళ్లుగా చెల్లించడం లేదు. ఈ క్రమంలో కార్మికులు కుటుంబాలతో సహా పస్తులుండాల్సిన దుస్థితి నెలకొంది. కేవలం వెయ్యి రూపాయలు ఇస్తామని ప్రకటించినా అది కూడా ఆర్నెళ్లుగా చెల్లించకపోవడంతో కార్మికులు మానసిక వేదనకు గురవుతున్నారు.



విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న కార్మికురాలు

అప్పు చేసి అల్పాహారం అందిస్తున్నాం



ఎనిమిది నెలలుగా అల్పాహారం అందిస్తుండగా ప్రభుత్వం మొదటి రెండు నెలలు మాత్రమే బిల్లులు చెల్లించింది. మిగతా ఆర్నెళ్లుగా పెండింగ్‌లో ఉంచడంతో ప్రైవేట్ వ్యక్తుల వద్ద వడ్డీకి అప్పు తెచ్చి అల్పాహారం అందిస్తున్నాం. ప్రభుత్వం బిల్లులు సత్వరమే విడుదల చేయాలి. ఇంకా ఆలస్యం చేస్తే ప్రభుత్వం ఇచ్చే డబ్బులు వడ్డీలకే సరిపోయే ప్రమాదం ఉంది.

-రమ, కార్మికురాలు, నందిగామ

బిల్లుల విడుదలలో జాప్యం సరికాదు



పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచే లక్ష్యంతో అల్పాహార పథకం చేపట్టి బిల్లుల విడుదలలో జాప్యం సరికాదు. కేవలం 2 నెలలు మాత్రమే బిల్లులు ఇచ్చి ఆర్నెళ్లుగా పెండింగ్ ఉంచడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అప్పుల పాలవుతున్నాం. బాకీలు వేలాదిగా పెరిగి పోతుండడంతో కిరాణా షాపుల నిర్వాహకులు సరుకులు ఇవ్వడం లేదు.

-పులి రజిత, కార్మికురాలు, నల్లబెల్లి

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం

- ఏబీవీపీ రాష్ట్ర సమితి సభ్యుడు రాజ్‌కుమార్



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

నర్సంపేట : విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే ఏబీవీపీ లక్ష్యమని రాష్ట్ర సతిమి సభ్యుడు వేల్పుల రాజ్‌కుమార్ తెలిపారు. జాతీయ విద్యార్థి దినోత్సవం (ఏబీవీపీ ఆవిర్భావం) సందర్భంగా పట్టణంలో సంఘం జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 1949లో ఐదుగురితో మొదలై ప్రస్తుతం 60 లక్షల సభ్యత్వంతో ముందుకు సాగుతోందని చెప్పారు. విద్యార్థులు జాతీయ స్థాయిలో ఎదిగేలా చైతన్యవంతం చేయడానికి పాటుపడుతున్నట్టు తెలిపారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నాల శశికుమార్, నగర కార్యదర్శి దీపక్, కార్యకర్తలు అఖిల్, హేమంత్, సూర్యతేజ, సిద్ధూ, తదితరులు పాల్గొన్నారు.

‘శ్రీచైతన్య’ బోర్డు తొలగింపు



రాయపర్తి (వర్ధన్నపేట) : వర్ధన్నపేటలోని శ్రీ అరవిందో హైస్కూల్ యాజమాన్యం ‘శ్రీ చైతన్య టెక్నో కరికులం’ అంటూ ముద్రించి ఏర్పాటు చేసిన బోర్డును ఎంఈఓ రంగయ్య మంగళవారం తొలగింపజేశారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయంటూ సోషల్ మీడియాలో జరిగిన ప్రచారానికి విద్యాశాఖ అధికారులు స్పందించారు. ఎంఈఓ రంగయ్య వర్ధన్నపేటకు చేరుకుని శ్రీ అరవిందో హైస్కూల్ యాజమాన్యం ఏర్పాటు చేసిన బోర్డును తొలగింపజేసి మాట్లాడారు. శ్రీఅరబిందో హైస్కూల్ అని మాత్రమే బోర్డుపై రాసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. పలుమార్లు షోకాజ్ నోటీసులు అందించినా యాజమాన్యం తీరు మారడం లేదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే స్కూల్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

పోస్టల్ బీమా డబ్బు అందజేత



బీమా డబ్బు అందజేస్తున్న మేనేజర్లు

చెన్నారావుపేట : మండలంలోని సూర్యపేట తండాకు చెందిన ధారావత్ శ్రీనుకు ఐపీపీబీ మేనేజర్లు సునీత, సంపత్, సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సుచందర్ మంగళవారం రూ.41 వేల 713 బీమా డబ్బు అందజేశారు. ఈ సందర్భంగా సునీత, సంపత్, సుచందర్ మాట్లాడారు. శ్రీను కొన్ని నెలల క్రితం స్థానిక పోస్టాఫీసులో రూ.399 చెల్లించి ఖాదర్‌పేట పోస్టాఫీస్‌లో పోస్టల్ ఇన్సూరెన్స్ చేయించుకున్నాడని తెలిపారు. తదనంతరం శ్రీను ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి గాయాల పాలవగా బీమా మంజూరైందని చెప్పారు. కార్యక్రమంలో సబ్ పోస్టుమాస్టర్ పర్శ రాజ్‌కుమార్, సిబ్బంది గుగులోతు సుమన్, క్రాంతికిరణ్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

నర్సంపేట : ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గడ్డం సదానందం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐకేఎస్) డివిజన్ అధ్యక్షుడు కత్తుల కొమురయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశానికి సదానందం హాజరై మాట్లాడారు. అర్హులకు పెరిగిన ధరలకు అనుగుణంగా పెన్షన్ ఇవ్వాలని, రైతులకు పాత రుణాలు రద్దు చేసి కొత్త రుణాలు ఇవ్వాలని, వ్యవసాయ కార్మికులకు రూ.12 వేల ఆసరా పథకాన్ని అమలు చేయాలన్నారు, ఉద్యోగ ఖాళీలపై శ్వేతపత్రం ప్రకటించడంతోపాటు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, పోడు సాగుదారులందరికీ పట్టాలు ఇచ్చి హక్కులు కల్పించాలని అన్నారు. డిమాండ్ల సాధన కోసం ఈనెల 22న తహసీల్దార్, 29న కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేస్తామన్నారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి, డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు, నాయకులు మైదం పాణి, మధుసూదన్‌రెడ్డి, దారా లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

అద్దె వాహనాల బిల్లులు చెల్లించాలి

గీసుకొండ : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అవసరాల కోసం ఏర్పాటు చేసుకున్న ప్రైవేట్ వాహనాలకు అద్దె చెల్లించాలని డిమాండ్ చేస్తూ డ్రైవర్లు డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అధికారుల కోసం ఏర్పాటు చేసిన వాహనాలకు 12 నెలల నుంచి బిల్లులు చెల్లించడంలేదని తెలిపారు. తమ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని వాపోయారు. వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో డ్రైవర్లు మహేందర్, బాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లోనూ ‘ఉపాధి’ కల్పించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రాయపర్తి (వర్ధన్నపేట) : మున్సిపాలిటీల్లోనూ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేసి నిరుద్యోగ యువతకు పని కల్పించాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం తహసీల్దార్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేసింది. అనంతరం కుమారస్వామి మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని పల్లెలకు పరిమితం చేయడంతో మున్సిపాలిటీల పరిధిలో యువత పనుల్లేక వలస పోతున్న దుస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని, అన్ని జిల్లాల్లో నవోదయ పాఠశాలలు ఏర్పాటు చేయాలని, వర్ధన్నపేటలో పరిశ్రమలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టి ఉపాధి కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కంజర్ల సోమయ్య, గబ్బెట బాబు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



నర్సంపేట రూరల్ : సమాజంలోని ప్రతీఒక్కరు మొక్కలను విరివిగా నాటి సంరక్షించాలని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి ఆకాంక్షించారు. నర్సంపేట మండలంలోని లక్నేపల్లి శివారులోని బాలాజీ టెక్నో స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన వనమహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలను నాటి మాట్లాడారు. మానవ మనుగడకు అవసరమైన ప్రాణవాయువు అందించేందుకు, ప్రకృతి సమతుల్యత కాపాడుకునేందుకు వనాలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సకాలంలో వర్షాలు కురవాలన్నా, వాతావరణంలోని బొగ్గుపులుసు వాయువు శాతాన్ని తగ్గించాలన్నా చెట్లు కీలకమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ రూరల్ :
9951602875 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. రాజు యాదవ్ (S.R) : 9502950309 (వర్ధన్నపేట)
ఎం. మురారి (S.R) : 9502950309 (నర్సంపేట)
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944